www.bhadradrinews.com

భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily

పేద కుటుంబాలకు అండగా
ఇందిరమ్మ జీవిత బీమా పథకం



4 లో..

గ్రామ ప్రజలు సమస్యలతో సతమతం అవుతున్న
లో వోల్టేజ్ సమస్యకు చెక్!



3 లో..

హైదరాబాద్, సంపుటి : 4 సంచిక: 298, గురువారం 26-11-2026 ఎడిటర్ : చెంగపొంగు సైదులు పేజీలు : 6 వేల : 5

Published from Khammam,Circulated by Hyderabad, Karimnagar, adilabad, Nizamabad, Warangal, Nalgonda, Mahabubnagar, Khammam

పౌల్ట్రీ రంగానికి సింగిల్ విండో అనుమతులు



- గ్రామీణ ప్రాంతాల్లోనూ వేగంగా అనుమతుల మంజూరుకు చర్యలు
- ఫ్యూచర్ సిటీలో ప్రత్యేక కన్వెన్షన్ సెంటర్‌కు భూకేటాయింపు హామీ
- మొక్కజొన్న, సోయాబీన్ సరఫరాపై 48 గంటల్లో నిర్ణయం ..
- పౌల్ట్రీని ప్రాధాన్యత పరిశ్రమగా గుర్తిస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 25

తెలంగాణలో పౌల్ట్రీ పరిశ్రమ అభివృద్ధికి మరింత ప్రోత్సాహం అందిస్తామని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. పరి శ్రమ స్థాపనకు అవసరమైన అనుమతుల విషయంలో ఎలాంటి జాప్యం జరగకుండా సమగ్ర విధానాన్ని రూపొందించి సింగిల్ విండో విధానాన్ని అమల్లోకి తీసుకొస్తామని ప్రకటించారు. గ్రామీణ ప్రాంతాల్లో పౌల్ట్రీ ఫారాల ఏర్పాటుకు అనుమతులు, భూమి మార్పిడి వంటి ప్రక్రియల్లో ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరిస్తామన్నారు. హైద రాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఇండియన్ పౌల్ట్రీ ఎక్విప్‌మెంట్ మాన్యుఫాక్చ రర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తు న్న 18వ పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పో 2026ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. మూడు రో జులపాటు జరిగే ఈ ప్రదర్శనలో జాతీయ, అంతర్జాతీయ సంస్థలు తమ ఉత్పత్తులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రదర్శిస్తున్నాయి.

గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు పొందడం ఆలస్యమవుతోం దని పౌల్ట్రీ రంగ ప్రతినిధులు తన దృష్టికి తీసుకొచ్చినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. పట్టణాల్లో బిల్డ్‌నౌ యాప్ ద్వారా అమలు చేస్తున్న సింగిల్ విండో అనుమతుల విధా నాన్ని త్వరలో గ్రామీణ ప్రాంతాలకు కూడా విస్తరిస్తామని చెప్పారు. పౌల్ట్రీ పరిశ్రమ అభివృద్ధికి సంబంధించిన సమగ్ర ప్రతిపా దనలతో ముందుకు వస్తే భారత్ ఫ్యూచర్ సిటీలో ప్రత్యేక కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటుకు అవసరమైన భూమిని కేటాయించే అంశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. డిసెంబర్ 7 నుంచి 9 వరకు నిర్వహించనున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ సందర్భంగా పరిశ్రమ ప్రతి నిధులు తమ ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు.

పౌల్ట్రీ పరిశ్రమకు కొన్నిసార్లు మార్కెట్ ఒడిదుడుకులు, ఉత్పత్తి వ్యయాల పెరుగు దల వంటి సమస్యలు ఎదురవుతాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ముఖ్యంగా కోళ్ల దాణా తయారీలో కీలకమైన మొక్కజొన్న, సోయాబీన్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తిన ప్పుడు ప్రభుత్వం సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో ఆహార ధాన్యాల నిల్వలు, పౌరసరఫరాల శాఖ వద్ద అందుబా టులో ఉన్న నిల్వలను పరిశీలించి పౌల్ట్రీ పరి శ్రమ అవసరాలకు అనుగుణంగా సరఫరా చేసే అవకాశాలను పరిశీలిస్తామన్నారు. బహిరంగ మార్కెట్‌లో విక్రయించే బదులు అవసరమైన మేరకు పరిశ్రమకు అందించే ప్రభుత్వ నిల్వలు ఎంత ఉన్నాయి, ఏ ధరకు సరఫరా చేయవచ్చనే అంశాలపై వ్యవసాయ శాఖ మంత్రితో సమీక్షించి 48 గంటల్లో నిర్ణయం తీసుకోవాలని వాకిటి శ్రీ హరికి వేదికపైనే సూచించారు.

పౌల్ట్రీ పరిశ్రమ రైతులకు, రైతు కూలీలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతో మేలు చేస్తోందని రేవంత్ రెడ్డి ప్రశంసించారు. రైతులు పండించే మొక్కజొన్న, సోయా బీన్‌తో పాటు నూకలు, తౌడు వంటి ఉప ఉత్పత్తులను కూడా ఈ పరిశ్రమ కొనుగోలు చేస్తోందని తెలిపారు. తెలంగాణలో ప్రతి రోజూ సుమారు 5.30 కోట్ల గుడ్లు ఉత్పత్తి అవుతున్నాయని, తద్వారా ప్రజలకు ప్రోటీన్ అందించడంలో ఈ రంగం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో వారానికి మూడు గుడ్లతో పాటు చికెన్‌తో కూడిన భోజనాన్ని అందించడంలోనూ పౌల్ట్రీ రంగం సహకారం ఉపయోగపడుతోందని చెప్పారు. ఐటీ, ఔషధ, రక్షణ రంగాలతో పాటు పౌల్ట్రీ పరిశ్రమను కూడా ప్రభుత్వం ప్రాధాన్యత రంగంగా గుర్తిస్తోందన్నారు. పరి శ్రమ సమస్యల పరిష్కారానికి నిరంతరం పనిచేసే ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తామ ని తెలిపారు.

తెలంగాణలో పెట్టుబడిదారులకు భరోసా కల్పించే విధానాలను కొనసాగిస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గత మూడు దశాబ్దాలుగా రాష్ట్రంలో అమలైన మంచి పారిశ్రామిక విధానాలను కొనసాగిస్తూ మరింత మెరుగుపరుస్తున్నామని తెలిపారు. దేశ జనాభాలో తెలంగాణ వాటా సుమారు 2.5 శాతం కాగా, జాతీయ స్థూల దేశీయో త్పత్తిలో రాష్ట్రం ఐదు శాతం వాటా కలిగి ఉందని, దీనిని పది శాతానికి పెంచడమే లక్ష్యమని వెల్లడించారు. 2034 నాటికి లక్ష కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక శక్తిగా తెలంగాణను తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టు కున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి, ఎంపీలు, ప్రజాప్ర తినిధులు, ఐపీఈఎంఏ అధ్యక్షుడు ఉదయ్ సింగ్ బయాస్, పౌల్ట్రీ పరిశ్రమ ప్రతినిధులు, జాతీయ, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు తెలంగాణ సిద్ధం

- డిసెంబర్ 11 నుంచి 22 వరకు పోటీల నిర్వహణ
- ఎల్బీ స్టేడియంలో ప్రారంభం.. గచ్చిబౌలిలో ముగింపు వేడుకలు
- 27 క్రీడాంశాల్లో 861 మంది రాష్ట్ర క్రీడాకారుల ప్రాతినిధ్యం
- నిర్వహణకు రూ.203 కోట్లు.. ప్రపంచస్థాయి వసతుల కల్పన
- సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 25

తెలంగాణను అంతర్జాతీయ క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంలో భాగంగా నిర్వహిస్తున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్ భవిష్యత్తులో రాష్ట్ర క్రీడారంగానికి బలమైన పునాదిగా నిలుస్తాయని ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. డిసెంబర్ 11 నుంచి 22 వరకు రాష్ట్రంలో తొలిసారిగా జరగనున్న ఈ పోటీల ఏర్పాట్ల పురోగతి పై మంత్రి వాకిటి శ్రీహరితో పాటు వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష ని ర్వహించారు. యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేలా డిసెంబర్ 11న ప్రారంభ వేడుకలను అట్టహాసంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నగరంతో పాటు పోటీలు జరిగే జిల్లాల్లోనూ పండుగ వాతావరణం కనిపించేలా ఏర్పా ట్లు చేయాలని సూచించారు.

ఖేలో ఇండియా యూత్ గేమ్స్ ప్రారంభ వేడుకలను ఎల్బీ స్టేడియంలో, ముగింపు వేడుకలను గచ్చిబౌలి స్టేడియంలో నిర్వ హించేలా కార్యాచరణ సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ రెండు కార్యక్రమాల పర్యవేక్షణ బాధ్యతలను మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మె ల్సీలకు అప్పగించాలని ఆదేశించారు. హై దరాబాద్‌తో పాటు వివిధ జిల్లాల్లో పోటీలు జరగనున్నందున ఉమ్మడి జిల్లాల వారీగా మంత్రులను ఇన్‌చార్జిలుగా నియమించి ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలని చెప్పారు. హైదరాబాద్‌కు పొన్నం ప్రభాక ర్, రంగారెడ్డికి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మహ బూబ్‌నగర్‌కు జూపల్లి కృష్ణారావు, వరం గల్‌కు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కరీంన గర్‌కు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఖమ్మంకు తుమ్మల నాగేశ్వరరావు, నిజామాబాద్‌కు ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్‌రెడ్డిని బా ధ్యులుగా నియమించాలని సూచించారు. స్టేడియంల పునరుద్ధరణ, మౌలిక సదుపా యాల కల్పనలో నాణ్యత విషయంలో రాజీ పడవద్దని ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టం చేశారు. అభివృద్ధి పనులపై విజిలె న్స్ నిఘా ఉండాలని, క్రీడాకారులకు అం తర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా వసతులు కల్పించాలని ఆదేశించారు. ఈ నెలాఖరులోగా స్టేడియాలకు సంబంధిం చిన పనులన్నీ, 27 క్రీడాంశాలకు అవసర మైన పరికరాల

మిగతా 2 లో..



డ్రగ్స్ రహిత భారత్ కోసం పాదయాత్ర

- అంబర్‌పేట మహంకాళి ఆలయం వద్ద మూడు రోజుల యాత్రకు శ్రీకారం
- విద్యార్థులు, యువత, ప్రజల భాగస్వామ్యంతో అవగాహన కార్యక్రమం
- డ్రగ్స్ తయారీ, సరఫరా చేసే ముఠాలపై కఠిన చర్యలు తీసుకోవాలని పిలుపు
- వ్యసనానికి బానిసైన యువతకు చికిత్స, పునరావాసం కల్పించాలన్న కేంద్ర మంత్రి

హైదరాబాద్, నవంబర్ 25

దేశంలో మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టి, యువతను డ్రగ్స్ మహమ్మారి నుంచి కాపాడాలనే లక్ష్యంతో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హైదరాబాద్‌లో మూడు రోజుల పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. 'హైదరా బాద్ వాక్స్ ఫర్ నషా ముక్త్ భారత్' పేరుతో అంబర్‌పేటలో ప్రారంభమైన ఈ యాత్రకు విద్యార్థులు, యువత, స్థానిక ప్రజల నుంచి స్పందన లభించింది. అంబర్‌పేట మహంకాళి ఆలయం వద్ద అమ్మవారి ఆశీస్సులు తీసుకున్న అనంతరం ఆయన పాదయాత్రను ప్రారంభించారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం ప్రజల్లో అవగాహన పెంచడం, యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచడం ఈ కార్య క్రమ ప్రధాన ఉద్దేశమని తెలిపారు.

ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ యువత దేశానికి అతిపెద్ద ఆస్తి అని, వారి శక్తి, సామర్థ్యాలు దేశాభివృద్ధికి ఉపయోగ పడాలని అన్నారు. అయితే మత్తు పదార్థాల వినియోగం యువత భవిష్యత్తును దెబ్బతీ సే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్ వ్యసనం వ్యక్తిగత జీవితా నికే పరిమితం కాకుండా కుటుంబాలు, సమాజంపై కూడా తీవ్ర ప్రభావం చూపు తుందని పేర్కొన్నారు. ఈ సమస్యను ఒక్క ప్రభుత్వంతోనే పరిష్కరించడం సాధ్యం కాదని, ప్రజలు,

మిగతా 2 లో..

ఓబీసీ కులగణన ఉద్యమానికి వీరమణి మద్దతు

- చెన్నైలో కృష్ణసామి వీరమణిని కలిసిన ప్రతినిధి బృందం
- నవంబర్ 28 ఢిల్లీ నిరసన కార్యక్రమానికి ఆహ్వానం
- ప్రతి ఓబీసీ కులానికి ప్రత్యేక కోడ్ కేటాయించాలని డిమాండ్
- జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలని సూచన

చెన్నై, నవంబర్ 25

దేశవ్యాప్తంగా ఓబీసీల సమగ్ర కులగణన చేపట్టాలనే డిమాండ్‌కు ద్రవిడర్ కజగం అధ్యక్షుడు, ప్రముఖ సామాజికవేత్త కృష్ణసా మి వీరమణి మద్దతు తెలిపారు. చెన్నైలోని పెరియార్ గ్రౌండ్స్‌లో ఆల్ ఇండియా కో ఆర్డినేషన్ కమిటీ సభ్యులు, మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్, ఎంపీ పి. విల్సన్, ఢిల్లీ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ సూరజ్ యాదవ్ మండల్, అఖిల భారత ఓబీసీ స్టూడెంట్స్ యూనియన్ నాయకులు కిరణ్ కుమార్ రజినీకాంత్ గౌడ్, జయంత్ యాదవ్ తది తరులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఓబీసీ కులగణన ఆవశ్యకత, అందుకోసం చేపట్టిన ఉద్యమ కా ర్యాచరణపై చర్చించారు. 2026 నవంబర్ 28న న్యూఢిల్లీలోని రామ్‌లీలా

మిగతా 2 లో..



అర్హులైన కుటుంబాలకు రూ.5 లక్షల జీవిత బీమా

- గంగిపల్లిలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా నమోదు ప్రారంభం
- 18 నుంచి 59 ఏళ్ల అర్హులకు బీమా రక్షణ
- గ్రామంలో 118 ఇందిరమ్మ ఇళ్ల మంజూరు.. 85 నిర్మాణ దశలో
- విద్యుత్ ప్లాంట్‌లో స్థానికులకు ఉద్యోగాల కల్పనకు కృషి

మంచిర్యాల, నవంబర్ 25

అర్హులైన ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకా న్ని అమలు చేస్తోందని రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం గంగిపల్లి గ్రామంలో ఈ పథకం నమోదు ప్రక్రియను ఆయన ప్రారంభించారు. రేషన్ కార్డు ఆధారంగా కుటుంబంలోని 18 నుంచి 59 సంవత్స రాల వయస్సు కలిగిన అర్హులైన సభ్యులకు రూ.5 లక్షల జీవిత బీమా సౌకర్యం కల్పి స్తున్నట్లు వివరించారు. అర్హత కలిగిన ప్రతి



కుటుంబం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజల సంక్షేమానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు వివరించా రు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యం, ఆసరా పెన్షన్లు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచిత అల్పాహా రం అందించే కార్యక్రమాలను కూడా ప్రస్తా వించారు. ప్రజల జీవన

మిగతా 2 లో..

వ్యవసాయ రంగంలో భారీ పెట్టుబడులే లక్ష్యం

- ప్రపంచ స్థాయి పెట్టుబడులకు తెలంగాణను గమ్యస్థానంగా తీర్చిదిద్దే యోచన
- డిసెంబర్ 7 నుంచి భారత్ ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్
- ఎరువులు, ఆహార శుద్ధి, ఎఫ్ఎంసీజీ రంగాలపై ప్రత్యేక దృష్టి
- రైతు నుంచి వినియోగదారుడి వరకు సమగ్ర విలువ శృంఖల అభివృద్ధి



హైదరాబాద్, నవంబర్ 25

తెలంగాణను ప్రపంచ స్థాయి వ్యవసాయ పెట్టుబడులకు ప్రధాన గమ్యస్థా నంగా తీర్చిదిద్దడంతో పాటు వ్యవసాయం, ఎరువులు, ఆహార శుద్ధి పరిశ్రమలు, ఎఫ్ఎం సీజీ రంగాల్లో భారీ పెట్టుబడులను ఆకర్షిం చడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సా గుతోందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. డిసెంబర్ 7 నుంచి 9వ తేదీ వరకు హైదరాబాద్‌లోని భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న 'ఇన్వెస్ట్

తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026' నేపథ్యం లో తెలంగాణ సచివాలయంలో సంబంధిత రంగాల ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ పరిచయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశా నికి మంత్రి అధ్యక్షత వహించి పెట్టుబడుల అవకాశాలు, భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. వ్యవసాయ ఇన్‌పుట్స్, ఎరువుల తయారీ సంస్థలు, ఆహార శుద్ధి పరిశ్రమలు, ఎఫ్ఎంసీజీ కంపెనీలు, ఆహార ఉత్పత్తుల బ్రాండ్లు, పరిశోధనా సంస్థలు, అభివృద్ధి భా గస్వామ్య సంస్థల

మిగతా 2 లో..

www.bhadradrinews.com
భద్రాద్రి న్యూస్
తెలుగు దినపత్రిక
Follow :
@bhadradrinews
గురువారం
26 । నవంబర్ । 2026
www.bhadradrinews.com
epaper.bhadradrinews.com
ఖమ్మం,
భద్రాద్రి కొత్తగూడెం

డ్రగ్స్ రహిత భారత్ కోసం పాదయాత్ర

(మొదటి పేజీ తరువాయి)

తల్లిదండ్రులు, విద్యాసంస్థలు, సామాజిక సంస్థలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.డ్రగ్స్ తయారీదారులు, సరఫరాదారులు, అక్రమ వ్యాపారంలో పాల్గొనే వారిని గుర్తించి చట్టం ముందు నిలబెట్టాలని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. మత్తు పదార్థాల అక్రమ తయారీ, రవాణా, విక్రయాలపై నిఘా పెంచడంతో పాటు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. యువతను లక్ష్యంగా చేసుకుని మత్తు పదార్థాలను చేరవేసే నెట్‌వర్క్‌లను అడ్డుకోవడానికి ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.అదే సమయంలో మత్తు పదార్థాలకు బానిసైన యువత పట్ల సమాజం మానవీయ దృక్పథంతో వ్యవహరించాలని కిషన్‌రెడ్డి సూచించారు. వ్యసనానికి లోనైన వారిని గుర్తించి, వారికి అవసరమైన వైద్య చికిత్స, మానసిక కౌన్సెలింగ్, పునరావాస సహాయం అందించాలని అన్నారు. సరైన సహకారం లభిస్తే వారు వ్యసనం నుంచి బయటపడి తిరిగి సాధారణ జీవితాన్ని ప్రారంభించగలరని పేర్కొన్నారు. యువతను నిందించడం కంటే వారిని వ్యసనం నుంచి బయటపడేలా ప్రోత్సహించడం, కుటుంబాలు వారికి అండగా నిలవడం ముఖ్యమని వివరించారు. మత్తు పదార్థాల వల్ల ఎదురయ్యే నష్టాలపై పాఠశాలలు, కళాశాలల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు.'నషా ముక్త్ భారత్' నిర్మాణం ఒక ప్రజా ఉద్యమంగా మారాలని, దేశ భవిష్యత్తును కాపాడుకోవడంలో ప్రతి పౌరుడు తన వంతు బాధ్యత నిర్వర్తించాలని కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు, పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ప్రముఖ సినీ నటుడు దగ్గుబాటి వెంకటేష్ కూడా కార్యక్రమానికి హాజరయ్యారు.

ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు తెలంగాణ సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

సమకూర్పు పూర్తి చేస్తామని అధికారులు సమావేశంలో వివరించారు. ఇప్పటికే 14 స్టేడియాల్లో పనులు పూర్తయ్యాయని, మిగిలిన ఆరు స్టేడియాల్లోనూ నెలాఖరులోగా పనులు ముగిస్తామని తెలిపారు.

తెలంగాణ సంప్రదాయ యుద్ధకళ కర్రసాముకు ఈ పోటీల్లో తొలిసారిగా ప్రదర్శన క్రీడగా అవకాశం కల్పిస్తున్నారు. జాతీయ స్థాయిలో ఈ కళకు గుర్తింపు తీసుకురావడంతో పాటు రాష్ట్రంలో దాని ప్రాచుర్యాన్ని పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. కర్రసాముకు సంబంధించిన బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించారు. మరోవైపు 27 క్రీడాంశాల్లో పాల్గొనేందుకు రాష్ట్రానికి చెందిన 1,334 మంది క్రీడాకారులకు శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. యూత్ గేమ్స్‌లో తెలంగాణ తరపున పాల్గొనే 861 మంది క్రీడాకారులు, కోచ్‌లకు స్పోర్ట్స్‌కిట్లు పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు.

ఈ క్రీడల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం మొత్తం రూ.203 కోట్లు ఖర్చు చేస్తుండగా, కేంద్ర ప్రభుత్వం తన వాటాగా రూ.21 కోట్లు కేటాయించింది. స్టేడియాల్లో ప్రపంచస్థాయి ప్రమాణాలతో అభివృద్ధి పనులు చేపట్టడం, అత్యాధునిక క్రీడా పరికరాలు సమకూర్చడం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.120 కోట్లు వెచ్చిస్తోంది. భవిష్యత్తులోనూ క్రీడాకారులకు ఉపయోగపడేలా క్రీడా ప్రాంగణాలను శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి చేస్తున్నట్లు అధికారులు వివరించారు. ఈ పోటీలను విజయవంతంగా నిర్వహించడంతో పాటు రాష్ట్రంలో క్రీడా మౌలిక వసతులను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఏర్పాట్లను వేగవంతం చేస్తోంది.

ప్రొఫెసర్ జయశంకర్ స్వగ్రామానికి మోడల్ విలేజ్ హంగులు!

- **అక్కంపేట సమగ్ర అభివృద్ధికి కార్యాచరణ సిద్ధం చేయాలి**
- **గ్రంథాలయం, వాకింగ్ ట్రాక్, భూగర్భ డ్రైనేజీ, మెరుగైన మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదనలు**
- **అధికారులకు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి సూచనలు**



హనుమకొండ, నవంబర్ 25

తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ స్వగ్రామమైన ఆత్మకూరు మండలంలోని అక్కంపేట గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర అభివృద్ధి ప్రణాళిక రూపొందించి, అవసరమైన చర్యలు చేపట్టాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అధికారులకు సూచించారు.రాష్ట్రప్రభుత్వం అక్కంపేటను ఆదర్శ గ్రామంగా ఎంపిక చేసిన నేపథ్యంలో గ్రామానికి ఆధునిక మౌలిక సదుపాయాలు కల్పించి, ఆహ్లాదకరమైన వాతావరణంతో అభివృద్ధి చేయాలని అన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష.. మౌలిక వసతులకు ప్రాధాన్యం:

బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో అక్కంపేట గ్రామ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. గ్రామంలో ప్రస్తుతం ఉన్న సామాజిక, అభివృద్ధి పరిస్థితులను సమీక్షించి, చేపట్టాల్సిన పనులపై చర్చించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ అక్కంపేటను ఆదర్శ గ్రామంగా ఎంపిక చేయడం గ్రామ అభివృద్ధికి మంచి అవకాశమని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గ్రామ రూపురేఖలు మార్చేలా అభివృద్ధి పనులు చేపట్టాలని అన్నారు. విద్యార్థులు, యువతకు ఉపయోగపడేలా ఆధునిక సౌకర్యాలతో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామంలోని రహదారులు, మురుగునీటి కాలువలు, తాగునీటి పైపులైన్ల నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ, మెరుగైన విద్యుత్ సౌకర్యాలు కల్పించేలా ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు శాఖలవారీగా సమగ్ర కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు.

నగర తరహా సౌకర్యాల కల్పనకు కృషి:

కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ గుండు సుధారాణి మాట్లాడుతూ ఆదర్శ గ్రామంగా ఎంపికైన అక్కంపేటలో నగర తరహా సౌకర్యాలతో పాటు ఆహ్లాదకర మైన వాతావరణం కల్పించాలని అన్నారు. ప్రజల ఆరోగ్యం, ఆహ్లాదం కోసం వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడంతో పాటు అవసర మైన ఇతర సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

త్వరగా అభివృద్ధి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి:

జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ అక్కంపేట గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు సంబంధిత శాఖల అధికారులు సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. గ్రామానికి అవసరమైన మౌలిక సదుపాయాలను గుర్తించి, అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలను త్వరితగతిన అందజేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ సామ్యు నాయక్, కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ ముఖ్య ప్రణాళిక అధికారి అజిత్ రెడ్డి, కార్యనిర్వాహక ఇంజినీర్ భీమ్ రావు, మిషన్ భగీరథ కార్యనిర్వాహక ఇంజినీర్ గాయత్రి, తహసీల్దార్ జగన్మోహన్ రెడ్డి, అక్కంపేట గ్రామ సర్పంచ్ సాంబయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఓబీసీ కులగణన ఉద్యమానికి వీరమణి మద్దతు

(మొదటి పేజీ తరువాయి)

మైదానంలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి వీరమణిని ప్రతినిధి బృందం ఆహ్వానించింది. 2027 జనగణనలో భాగంగా దేశవ్యాప్తంగా ఓబీసీల సమగ్ర కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించింది. ఓబీసీ వర్గాల్లోని ప్రతి కులాన్ని ప్రత్యేకంగా గుర్తించి లెక్కించాలని, జనగణనలో ప్రతి కులానికి ప్రత్యేక కోడ్ కేటాయించాలని కోరుతున్నట్లు తెలిపింది.కులగణన ప్రక్రియలో ప్రత్యేక డ్రాప్‌డౌన్ జాబితాను రూపొందించడం ద్వారా ఏ కులానికి సంబంధించిన వివరాలు నమోదు చేస్తున్నారో స్పష్టంగా గుర్తించే అవకాశం ఉంటుందని ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. దేశవ్యాప్తంగా ఓబీసీలలోని అన్ని కులాల జనాభా వివరాలు కచ్చితంగా నమోదు కావాలంటే ప్రత్యేక గుర్తింపు విధానం అవసరమని పేర్కొన్నారు. ఈ డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఢిల్లీలో నిరసన చేపడుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమానికి కృష్ణసామి వీరమణి సంపూర్ణ మద్దతు ప్రకటించినట్లు ప్రతినిధులు తెలిపారు. ఓబీసీ వర్గాల్లోని ప్రతి కులాన్ని జనగణనలో ప్రత్యేకంగా లెక్కించినప్పుడే ఆయా కులాల వాస్తవ జనాభా వివరాలు అందుబాటులోకి వస్తాయని ఆయన అభిప్రాయపడినట్లు వెల్లడించారు. జనాభా నిష్పత్తికి అనుగుణంగా విద్య, ఉద్యోగాలు, చట్టసభల్లో రాజకీయ రిజర్వేషన్ల అమలుకు సమగ్ర కులగణన ఆధారంగా ఉపయోగపడుతుందని వీరమణి పేర్కొన్నారు.ఓబీసీల సమగ్ర కులగణన అంశాన్ని జాతీయ స్థాయిలో చర్చకు తీసుకెళ్లడమే లక్ష్యంగా నవంబర్ 28న ఢిల్లీలో నిరసన నిర్వహించనున్నట్లు ప్రతినిధి బృందం తెలిపింది. కులాలవారీ జనాభా వివరాలు అందుబాటులో ఉంటే విద్య, ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్యానికి సంబంధించిన విధానాల రూపకల్పనలో స్పష్టత వస్తుందని వారు అభిప్రాయపడ్డారు.

అర్హులైన కుటుంబాలకు రూ.5 లక్షల జీవిత బీమా

(మొదటి పేజీ తరువాయి)

ప్రమాణాలు మెరుగుపడేలా సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నట్లు చెప్పారు. గంగిపల్లి గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని వివేక్ వెంకటస్వామి తెలిపారు. గ్రామంలో 118 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయగా, ఇప్పటికే 85 ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయని వెల్లడించారు.గ్రామ పాఠశాల అభివృద్ధికి రూ.50 లక్షలు కేటాయించడంతో పాటు, గత ఏడాది, ప్రస్తుత ఏడాది కలిపి రూ.30 లక్షల కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులు మంజూరు చేసినట్లు వివరించారు. విద్యా సదుపాయాలను మెరుగుపరిచేందుకు ఈ నిధులను వినియోగించనున్నట్లు తెలిపారు. గ్రామానికి రవాణా సౌకర్యం మెరుగుపరిచేలా రూ.1.57 కోట్లతో నిర్మించిన గంగిపల్లి-ఎల్కుంటి రహదారిని మంత్రి ప్రారంభించారు. శ్మశానవాటికకు వెళ్లే రహదారి నిర్మాణం కోసం రూ.2 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు.మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించడంపైనా దృష్టి పెట్టినట్లు చెప్పారు. జైపూర్ విద్యుత్ ప్లాంట్‌లో గంగిపల్లి గ్రామస్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.భవిష్యత్తులో 1,250 మెగావాట్ల నూతన విద్యుత్ ప్లాంట్ ప్రారంభమైనప్పుడు భూములు ఇచ్చిన నిర్వాసితులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానని మంత్రి తెలిపారు. గ్రామ ప్రజల అవసరాలు, సమస్యలను గుర్తించి వాటికి అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడతామని చెప్పారు. సంక్షేమ పథకాల అమలుతో పాటు రహదారులు, విద్య, ఉపాధి రంగాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తూ గంగిపల్లి గ్రామ సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు.

వ్యవసాయ రంగంలో భారీ పెట్టుబడులే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో నిర్వహించనున్న గ్లోబల్ సమ్మిట్ తెలంగాణలోని పెట్టుబడి అవకాశాలను ప్రపంచానికి పరిచయం చేయడానికి ఉపయోగపడుతుందని తుమ్మల తెలిపారు. అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడం, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడం, దీర్ఘకాలిక భాగస్వామ్యాలను ఏర్పరచుకోవడానికి ఈ సదస్సు వేదికగా నిలుస్తుందని వివరించారు.తెలంగాణ రైజింగ్-2047 దార్శనిక ప్రణాళికలో భాగంగా 2047 నాటికి రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించుకుందని మంత్రి తెలిపారు. ఈ లక్ష్య సాధనలో వ్యవసాయం, దాని అనుబంధ రంగాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న పెట్టుబడి అవకాశాలను పారిశ్రామికవేత్తలు సద్వినియోగం చేసుకోవాలని, తెలంగాణ అభివృద్ధి ప్రయాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ రంగంలో ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడంతో పాటు పరిశ్రమల అభివృద్ధికి అనుకూల వాతావరణం కల్పించడంపై ప్రభుత్వం దృష్టి సారిస్తోందన్నారు. వ్యవసాయం, ఎరువులు, వ్యవసాయ ఉత్పాదకాలు, ఆహార శుద్ధి, ఎఫ్ఎంసీజీ రంగాలను పరస్పరం అనుసంధానిస్తూ సమగ్ర విలువ శృంఖలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోందని తుమ్మల వివరించారు. రైతు పంట పండించే దశ నుంచి ఉత్పత్తుల శుద్ధి, నిల్వ, ప్యాకేజింగ్, మార్కెటింగ్, వినియోగదారుడికి చేరే వరకు ప్రతి దశలోనూ అవకాశాలను మెరుగుపరచడమే ఈ విధానం ఉద్దేశమని తెలిపారు. దీనివల్ల వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడించడంతో పాటు పరిశ్రమలకు అవసరమైన ముడిసరుకు లభ్యత, రైతులకు మెరుగైన మార్కెట్ అవకాశాలు ఏర్పడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

అంధత్వ నివారణపై ప్రత్యేక దృష్టి.. క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు!

- **హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంపై సమీక్ష**
- **2026–27 విద్యా సంవత్సరంలో 13.25 లక్షల మంది విద్యార్థులకు కంటి పరీక్షల లక్ష్యం**
- **అధికారులకు రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డా. ఎం. సువర్ణ దిశానిర్దేశం**



హనుమకొండ, నవంబర్ 25

తెలంగాణ రాష్ట్రంలో అంధత్వ నివారణ, దృష్టిలోపాల నియంత్రణ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. ఇందులో భాగంగా జాతీయ అంధత్వ నివారణ, దృష్టి లోపాల నియంత్రణ కార్యక్రమం అమలు తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు రాష్ట్ర జాయింట్ డైరెక్టర్, జాతీయ అంధత్వ నియంత్రణ అధికారి డా. ఎం. సువర్ణ హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పాఠశాల విద్యార్థుల కంటి పరీక్షలు, కంటి శస్త్రచికిత్సలు, నేత్రదాన కార్యక్రమాల పురోగతిని సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు.

రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ మహమ్మద్ ముషఫ్ అలీ ఫారూఖ్ ఆదేశాల మేరకు, ప్రజారోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు డా. బి. రవీంద్ర నాయక్ మార్గదర్శకత్వంలో ఈ పర్యటన చేపట్టారు.

పాఠశాల విద్యార్థుల కంటి పరీక్షలపై పరిశీలన:

పర్యటనలో భాగంగా హనుమకొండ జిల్లాలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించిన డా. సువర్ణ విద్యార్థులకు నిర్వహిస్తున్న కంటి పరీక్షల కార్యక్రమాన్ని పరిశీలించారు. దృష్టి లోపాలను గుర్తించడం, అవసరమైన విద్యార్థులకు కళ్లద్దాల పంపిణీ, తదుపరి వైద్య సేవలు అందించే ప్రక్రియపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం సుబేదారిలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఉన్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయాన్ని సందర్శించి ఇన్‌చార్జి డీఎంహెచ్ఓ డా. టి. మదన్ మోహన్ రావుతో సమావేశమయ్యారు. జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమం లక్ష్యాలు, అమలు తీరు, సాధించాల్సిన ఫలితాలు, ఎదురవుతున్న సమస్యలపై సమీక్షించారు.

వరంగల్‌లోనూ క్షేత్రస్థాయి తనిఖీలు:

వరంగల్ జిల్లాలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలను సందర్శించి విద్యార్థులకు నిర్వహిస్తున్న కంటి పరీక్షల కార్యక్రమాన్ని పరిశీలించారు.అలాగే పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి డా. రామ్ భార్గవ్‌తో అంధత్వ నివారణ కార్యక్రమం అమలుపై చర్చించారు. వరంగల్ ప్రాంతీయ కంటి ఆసుపత్రిని సందర్శించి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డా. శ్రీకుమార్‌తో సమావేశమై కంటి వైద్య సేవల మెరుగుదలకు పలు సలహాలు, సూచనలు అందించారు. పాఠశాల విద్యార్థుల కంటి పరీక్షల కార్యక్రమంలో మరింత పురోగతి సాధించాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా గుర్తించారు.

13.25 లక్షల మంది విద్యార్థులకు కంటి పరీక్షల లక్ష్యం:

2026-27 విద్యా సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, సంక్షేమ వసతి గృహాలు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు, మైనారిటీ, ఎస్సీ, బీసీ సంక్షేమ హాస్టళ్లు, ఇతర విద్యాసంస్థల్లో సుమారు 13.25 లక్షల మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు పాఠశాలల వారీగా కంటి పరీక్షల వేగాన్ని పెంచాలని, అందుబాటులో ఉన్న ప్రభుత్వ నేత్ర వైద్యాధికారులు, నేత్ర వైద్య నిపుణుల సేవలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. దృష్టి లోపాలు గుర్తించిన విద్యార్థులకు సకాలంలో కళ్లద్దాలు అందించడంతో పాటు అవసరమైన వారికి ప్రభుత్వ ఆసుపత్రుల్లో తదుపరి వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.

సమన్వయంతో లక్ష్యాలను సాధించాలి:

హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో కార్యక్రమాల అమలులో గుర్తించిన లోపాలను అధిగమించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో తక్షణ చర్యలు చేపట్టాలని డా. సువర్ణ సూచించారు. కార్యక్రమాల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్దేశిత లక్ష్యాలను సాధించేలా కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. 1976లో ప్రారంభమైన జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమం ద్వారా కంటి శస్త్రచికిత్సలు, విద్యార్థుల కంటి పరీక్షలు, ఉచిత కళ్లద్దాల పంపిణీ, నేత్రదానంపై అవగాహన వంటి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా ప్రజల్లో అంధత్వాన్ని, దృష్టి లోపాలను తగ్గించేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు.ప్రతి విద్యార్థికి స్పష్టమైన చూపు, ప్రతి అర్హుడికి నాణ్యమైన కంటి వైద్యం అందించడమే కార్యక్రమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

ఈ పర్యటన, సమీక్షా సమావేశాల్లో హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఇన్‌చార్జి అధికారి డా. మదన్ మోహన్ రావు, నేత్ర వైద్యాధికారి ప్రతాపగిరి ప్రసాద్, పరిపాలనాధికారి కోల రాజేష్, కార్యాలయ పర్యవేక్షకుడు కృష్ణ, హసన్‌పర్తి వైద్యాధికారి డా. రామ్ భార్గవ్, ఆర్‌బీఎస్‌కే వైద్యులు డా. కుమారస్వామి, డా. శ్రీనివాస్, డా. ఆదినారాయణ, డా. జ్యోతి, సబ్ యూనిట్ అధికారి విప్లవ్ కుమార్, ఆరోగ్య పర్యవేక్షకుడు లచ్చు, నర్సింగ్ అధికారులు, ఆరోగ్య సహాయకులు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యసన స్థాయిని మరింత మెరుగుపరచాలి!



- **ప్రభుత్వ పాఠశాలల్లో కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆకస్మిక తనిఖీలు**
- **విద్యార్థులతో మమేకమై పాఠ్యాంశాలపై ప్రశ్నలు.. ఉపాధ్యాయులకు పలు సూచనలు**

హనుమకొండ, నవంబర్ 25

: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మరింత పెంపొందించి, నాణ్యమైన విద్య అందించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సూచించారు. విద్యార్థులకు పాఠ్యాంశాలు సులభంగా అర్థమయ్యే రీతిలో బోధిస్తూ, వారి విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు కృషి చేయాలని అన్నారు.

బుధవారం దామెర మండలం వెంకటాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను కలెక్టర్ సందర్శించి విద్యాబోధన, విద్యార్థుల అభ్యసన స్థాయిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న విద్యాబోధన, వారి అభ్యసన సామర్థ్యాలు, మధ్యాహ్న భోజనానికి ముందు అందిస్తున్న అల్పాహారం, పాలు పంపిణీ తదితర అంశాలపై ఉపాధ్యాయులు, విద్యార్థులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

విద్యార్థులతో మమేకమై అభ్యసన సామర్థ్యాల పరిశీలన:

ఒకటి, రెండు, మూడు తరగతుల విద్యార్థులతో కలెక్టర్ స్వయంగా మాట్లాడి వారి నోట్‌బుక్‌లను పరిశీలించారు. విద్యార్థులు రాసిన పదాల అర్థాలను అడుగుతూ వారి చదవడం, రాయడం, అర్థం చేసుకునే సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పడంతో సంతోషం వ్యక్తం చేస్తూ అభినందించారు. నాలుగు, ఐదు తరగతుల విద్యార్థులతో పాఠ్యాంశాలను చదివించారు. పదో తరగతి విద్యార్థులు భౌతిక శాస్త్రానికి సంబంధించిన అంశాలను బోర్డుపై రాసిన విధానం, ఇచ్చిన సమాధానాలను పరిశీలించి, ఇదే ఆత్మవిశ్వాసంతో చదువులో ముందుకు సాగాలని సూచించారు.

ఎనిమిదో తరగతి విద్యార్థులను ఖాన్ అకాడమీ ద్వారా అందిస్తున్న డిజిటల్ పాఠ్యాంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. వాటిని ఎలా వినియోగిస్తున్నారో, ఎలా ప్రవేశం పొందుతున్నారో ఆరా తీశారు. పాఠశాలలో గ్రంథాలయ గది అందుబాటులో ఉందా అని అడిగి తెలుసుకోవడంతో పాటు పాఠశాల భవనాలను పరిశీలించారు.

విద్యాబోధనలో నాణ్యత పెంచాలి:

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థి అభ్యసన స్థాయిని అంచనా వేస్తూ, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. పాఠ్యాంశాలను సులభంగా అర్థమయ్యే విధంగా బోధించి, విద్యార్థుల్లో ఆలోచనా శక్తి, ఆత్మవిశ్వాసం పెంపొందించాలని సూచించారు. ప్రాథమిక పాఠశాలకు సంబంధించి ఇంకా పూర్తికాని భవన నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలు అందించాలని పంచాయతీరాజ్ శాఖ సహాయ ఇంజినీర్‌ను ఆదేశించారు.

ఈ పర్యటనలో గ్రామ సర్పంచ్ రాజు, స్థానిక తహసీల్దార్ జ్యోతి వరలక్ష్మి దేవి, మండల విద్యాశాఖ అధికారి జుమ్మా నాయక్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, ఉపాధ్యాయులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గ్రామ ప్రజలు సమస్యలతో సతమతం అవుతున్న

లో వోల్టేజ్ సమస్యకు చెక్!

- బర్లగూడెంలో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

- గ్రామ ప్రజల సమస్యల పరిష్కారమే నా ప్రధాన ధ్యేయం

- సర్పంచ్ మాలోతు కిషన్ నాయక్



కామేపల్లి, నవంబర్ 25 (భద్రాద్రిన్యూస్):

మండలం పరిధిలోని బర్లగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో ప్రజలు సమస్యలతో ఎదుర్కొంటున్న లో వోల్టేజ్ విద్యుత్ సమస్యకు పరిష్కారం లభించింది. గ్రామంలో విద్యుత్ సరఫరా సక్రమంగా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గ్రామ పంచాయతీ సర్పంచ్ మాలోతు కిషన్ నాయక్ విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఏఈ వెంటనే స్పందించి గ్రామంలో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయించారు. దీంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సమస్య పరిష్కారానికి చొరవ చూపిన సర్పంచ్ మాలోతు కిషన్ నాయక్‌తో పాటు వెంటనే స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసిన విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసులును గ్రామ ప్రజలు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాలోతు కిషన్ నాయక్ మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ అభివృద్ధే నా ప్రధాన లక్ష్యమని, ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్య పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు గ్రామ అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా కృషిచేసి పనిచేస్తానని అన్నారు.గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. విద్యుత్ శాఖ సిబ్బంది హట్కర్ బద్రు. వెంకన్న.గాంధీ. స్థానిక గ్రామ పాలకమండలి సభ్యులు.ప్రజలు తదితరులు పాల్గొన్నారు

నాణ్యమైన విద్యతోనే మెరుగైన ఫలితాలు సాధ్యం

- కామేపల్లి మండలంలో పలు ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ

- డీఈఓ వాసంతి విద్యార్థుల అభ్యసన స్థాయి, రికార్డులు, కేజీబీవీ వంటగది పరిశీలన





కామేపల్లి, నవంబర్ 25 (భద్రాద్రిన్యూస్):

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి,పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించడమే ప్రధాన లక్ష్యంగా ఉపాధ్యాయులు అంకితభావంతో కృషి చేయాలని ఖమ్మం జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి సూచించారు. బుధవారం ఆమె కామేపల్లి మండలంలోని ఎంపీపీఎస్ గోవింద్రాల బంజారా, జడ్పీహెచ్ఎస్ గోవింద్రాల, పాతలింగాల కేజీబీవీ పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గోవింద్రాల బంజారా ప్రాథమిక పాఠశాలలో మూడో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ఆంగ్ల పాఠ్యాంశ బోధనను ఆమె స్వయంగా పర్యవేక్షించారు. ఉపాధ్యాయుల బోధనా సరళిని గమనిస్తూనే, విద్యార్థులతో ప్రత్యక్షంగా సంభాషించి ఆంగ్లంలో చదవడం,అర్థం చేసుకోవడం వంటి అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. స్పాట్ అసెస్‌మెంట్ నిర్వహించి విద్యార్థుల స్థాయిని అంచనా వేశారు.
అనంతరం పాఠశాలల్లోని హాజరు,విద్యా నిర్వహణకు సంబంధించిన పలు రికార్డులు, రిజిస్టర్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పాతలింగాల కేజీబీవీలో వంటగది,స్టోర్ రూమ్‌లను పరిశీలించి నిల్వ సామగ్రి నాణ్యత, పరిశుభ్రతపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను వేగంగా పెంపొందించేందుకు నూతన బోధనా పద్ధతులను అమలు చేయాలని,ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.ఈ పర్యటనలో మండల విద్యాశాఖాధికారి వెంకట్,సీసీ మాధవరావు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు,కేజీబీవీ ప్రత్యేక అధికారులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు

డిసెంబర్ 6న యాదవ,కురుమవన సమారాధన

- కరపత్రాలు ఆవిష్కరించిన మహాసభ నేతలు

కామేపల్లి నవంబర్ 25 (భద్రాద్రిన్యూస్): రాజకీయాలు, వర్గాలకు అతీతంగా డిసెంబర్ 6న నిర్వహించనున్న యాదవ,కురుమ వన సమారాధనను విజయవంతం చేయాలని అఖిల భారత యాదవ మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షులు మేకల మల్లిబాబు యాదవ్,ఉమ్మడి జిల్లా కన్వీనర్ చిత్తారు సింహాద్రి యాదవ్ పిలుపునిచ్చారు. బుధవారం ఖమ్మంలోని రామకృష్ణ ఫంక్షన్ హాల్‌లో ఇందుకు సంబంధించిన కరపత్రాలను నాయకులు ఆవిష్కరించారు. కొత్తగూడెం రోడ్డులోని (గేట్ నెం. 2) చెరుకూరి మామిడి తోటలో జరిగే ఈ వేడుకకు కుటుంబ సమేతంగా తరలిరావాలని కోరారు.లోక కల్యాణం కోసం శ్రీకృష్ణుడు ప్రారంభించిన వనభోజన సంప్రదాయాన్ని నేడు అన్ని కులాల వారు జరుపుకోవడం గర్వకారణమని, భిన్నాభిప్రాయాలను పక్కనపెట్టి ఐక్యంగా ఉంటేనే రాజకీయంగా ఎదగగలమని మల్లిబాబు యాదవ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి లోడిగ వెంకన్న యాదవ్, ఉద్యోగుల యూనియన్ జిల్లా అధ్యక్షులు దుబాకుల శ్రీనివాస్,కురుమ సంఘం నేత గూదే భద్రయ్య, ఓబీసీ కాంగ్రెస్ నేత బమ్మిడి శ్రీనివాస్, మహిళా నేత కనకబండి విజయలక్ష్మి, చంద్రకాని రమణ యాదవ్, అల్లిక అంజయ్య యాదవ్,లిక్కి కృష్ణారావు యాదవ్,కోడి హరినాథ్ బాబు యాదవ్,రేఖ వెంకట సత్యనారాయణ యాదవ్,లోడిగ ఉమా యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా

- కెప్టెన్ బంజరలో ఇందిరమ్మ జీవిత బీమా ప్రారంభం



కామేపల్లి, నవంబర్ 25 (భద్రాద్రిన్యూస్): పేద మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన 'ఇందిరమ్మ జీవిత బీమా' పథకం కామేపల్లి మండలం కెప్టెన్ బంజర గ్రామంలో ఘనంగా ప్రారంభమైంది. బుధవారం గ్రామ సర్పంచి ఆరెం అచ్చమ్మ, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యనిర్వాహక సభ్యుడు ఆరెం రవి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ పథకాన్ని గ్రామస్థులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా,ప్రతి కుటుంబానికి అండగా నిలిచేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని రూపొందించిందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలను అందించడంలో కెప్టెన్ బంజర గ్రామ పంచాయతీ ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పథకం విధివిధానాలు, కలిగే ప్రయోజనాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించడంతో పాటు అర్హులైన లబ్ధిదారుల వివరాలను అక్కడికక్కడే ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి పవన్, వార్డు సభ్యుడు రవి, పంచాయతీ కార్యదర్శి విజయ మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే రాములు నాయక్!

- వివాహ వేడుకకు హాజరై నూతన దంపతులకు శుభాకాంక్షలు..

కుటుంబ సభ్యులతో ఆత్మీయ పలకరింపు



కారేపల్లి, భద్రాద్రి న్యూస్ (రాములు):

ఖమ్మం జిల్లా కారేపల్లి మండల పరిధిలోని బల్లు నగర్ తండాకు చెందిన బెల్ కంపెనీ జనరల్ మేనేజర్ గుగులోత్ రవి కుటుంబంలో జరిగిన వివాహ వేడుకకు వైరా మాజీ ఎమ్మెల్యే లావుడియా రాములు నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులు సావిత్రి, అనిల్ కుమార్‌లను ఆప్యాయంగా ఆశీర్వదించారు. నూతన దంపతుల వైవాహిక జీవితం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. వారి జీవితంలో నూతన అధ్యాయం ఆనందంగా సాగాలని మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కుటుంబ సభ్యులు, బంధువులతో కొద్దిసేపు ఆప్యాయంగా ముచ్చటించి వివాహ వేడుకలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధువులు, స్థానికులు తదితరులు పాల్గొన్నాం

పేద కుటుంబాలకు బీమా భరోసా.. ఇందిరమ్మ కుటుంబ జ్యోతి పథకాన్ని ప్రారంభించిన సర్పంచ్ హీరాలాల్!

- ప్రతి ఇంటి యజమాని నమోదు చేసుకోవాలి..

ప్రభుత్వ సంక్షేమ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రామస్తులకు సర్పంచ్ పిలుపు



కారేపల్లి, నవంబర్ 25 (భద్రాద్రి న్యూస్ -- రాములు):

పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించి, అనుకోని ఆపద సమయంలో కుటుంబ సభ్యులకు అండగా నిలవాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జ్యోతి జీవిత బీమా పథకాన్ని సింగరేణి మండలం భాగ్యనగర్ తండా గ్రామపంచాయతీలో మంగళవారం సర్పంచ్ బానోత్ హీరాలాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ హీరాలాల్ మాట్లాడుతూ.. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉండే వ్యక్తికి అనుకోని ప్రమాదం లేదా ప్రాణాపాయం సంభవించినప్పుడు ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా భరోసా కల్పించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమని వివరించారు. ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ జీవిత బీమా పథకాన్ని ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామంలోని ప్రతి ఇంటి యజమాని ఈ పథకంలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని, అర్హులైన వారెవరూ నమోదు ప్రక్రియను నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా గ్రామపంచాయతీ తరఫున అవగాహన కల్పిస్తామని తెలిపారు. కుటుంబ భవిష్యత్తుకు ఆర్థిక భద్రత కల్పించే ఇలాంటి పథకాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకొని, నమోదు ప్రక్రియలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బీముడు, వార్డు సభ్యులు కిషన్, నగేష్, రామ్ కిషోర్, హరిదాస్, గణేష్, హాము, భద్రయ్య, పంచాయతీ కార్యదర్శి పెండ్ర అనిల్ కుమార్, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వీబీజీ రామ్‌జీ పనులు

- ఎర్ర చెరువులో కూలీల సందడి



కామేపల్లి, నవంబర్ 25 (భద్రాద్రిన్యూస్): మండల పరిధిలోని సాతానిగూడెం గ్రామపంచాయతీలో వీబీజీ రామ్‌జీ పథకం కింద చేపట్టిన అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. గ్రామంలోని ఎర్ర చెరువులో పూడికతీత, పునరుద్ధరణ పనులను కూలీలు బుధవారం ఉత్సాహంగా చేపట్టారు. పనులు నాణ్యతా ప్రమాణాలతో వేగంగా జరిగేలా సాతానిగూడెం సర్పంచ్, క్షేత్ర సహాయకుడు (ఫీల్డ్ అసిస్టెంట్) పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పని ప్రదేశంలో కూలీలకు ఎండ నుంచి రక్షణ కోసం నీడనిచ్చే టెంట్, తాగునీటి వసతితో పాటు అత్యవసర వైద్య సామాగ్రి (ఫస్ట్ ఎయిడ్ కిట్) ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయని తెలిపారు. చెరువుల పునరుద్ధరణతో భవిష్యత్తులో భూగర్భ జలాలు పెరిగి సాగుకు మేలు జరుగుతుందని, స్థానిక కూలీలకు చేతినిండా ఉపాధి లభిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కూలీలు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణకు పాల్పడిన వ్యక్తులపై కేసు నమోదు

కామేపల్లి నవంబర్ 25 (భద్రాద్రి న్యూస్): ఘర్షణకు పాల్పడి దాడికి ప్రయత్నించిన ఇద్దరు వ్యక్తులపై కామేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండల పరిధిలోని తాళ్లగూడెం గ్రామానికి చెందిన నల్లమోతు వెంకట నర్సయ్య, నల్లమోతు లక్ష్మయ్య ఇద్దరు వ్యక్తులు అదే గ్రామానికి చెందిన ఏపూరి పెద్ద మల్లికార్జునరావు పై ఘర్షణకు పాల్పడి దాడి చేసేందుకు ప్రయత్నించారని బాధితుడు మల్లికార్జునరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. రాజకీయ కక్షలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ శాంతియుత వాతావరణంలో జీవించాలని ఆయన కోరారు కోరారు.

కొటమైసమ్మ అమ్మవారి దేవాలయానికి దాతల చేయూత!

- ఆలయానికి ప్రింటర్,ఇన్వర్టర్ బహుకరణ



కామేపల్లి, నవంబర్ 25 (భద్రాద్రిన్యూస్): కామేపల్లి మండల పరిధిలోని కొత్తలింగాల గ్రామంలో కొలువుదీరిన శ్రీ శ్రీ శ్రీ కొటమైసమ్మ అమ్మవారి దేవాలయానికి దాతలు తమ వంతు సహకారం అందించారు. ఇల్లందుకు చెందిన మార్గదర్శి స్కూల్ ఉపాధ్యాయులు రాధాకృష్ణ ఆలయానికి ప్రింటర్‌ను బహుకరించగా, కమలాపురానికి చెందిన. నాగండ్ల బాబు వెంకటేశ్వరరావు ఇన్వర్టర్‌ను బహుకరించారు. ఈ సందర్భంగా బహుకరించిన ప్రింటర్, ఇన్వర్టర్‌ను దేవాదాయశాఖ ఈఓ కొండకింద వేణుగోపాలాచార్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి పుల్లయ్య ప్రసాద్, సిబ్బంది,భక్తులు తదితరులు పాల్గొన్నారు. దేవాలయ అభివృద్ధికి, నిర్వహణకు దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. అమ్మవారి ఆలయానికి అవసరమైన సదుపాయాల కల్పనలో భాగస్వాములైన దాతలకు ఆలయ పూజారి పుల్లయ్య స్వామి.భక్తులు కృతజ్ఞతలు తెలిపారు.





పేద కుటుంబాలకు ఆర్థిక భరోసానే ప్రభుత్వ లక్ష్యం

- పాత లింగాలలో ఇందిరమ్మ బీమా శిబిరాన్ని ప్రారంభించిన రాంరెడ్డి గోపాల్ రెడ్డి

కామేపల్లి నవంబర్ 25 (భద్రాద్రిన్యూస్): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలలో భాగంగా,పాత లింగాల గ్రామంలో 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం' ప్రత్యేక నమోదు శిబిరాన్ని తెలంగాణ రాష్ట్ర అగ్రికల్చర్ డైరెక్టర్ రామిరెడ్డి గోపాల్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ బీమా పథకంలో పేర్లు నమోదు చేసుకుని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధుల సమన్వయంతో జరిగిన ఈ కార్యక్రమం గ్రామస్తుల విశేష స్పందనతో విజయవంతమైంది. ఈ శిబిరంలో ఎంపీడీవో ధరావత్ సోమ్ లాల్,ఎంపీఓ వివిఎస్ శాస్త్రి, గ్రామ సర్పంచ్ కిన్నెర సుజాత, మాజీ సర్పంచ్ కిన్నెర నాగయ్య, ఉపసర్పంచ్ గరిక గోపి,వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు మరియు పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



అధికారులకు ఎమ్మెల్యే కుమార్తె వివాహ ఆహ్వాన పత్రికల అందజేత

- సింగరేణి మండలంలోని వివిధ శాఖల అధికారులకు పెళ్లి శుభలేఖలు అందజేసిన కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు



కారేపల్లి, నవంబర్ 25 (భద్రాద్రి న్యూస్ రాములు): వైరా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ ఆదేశాల మేరకు ఆయన పెద్ద కుమార్తె వివాహ వేడుకకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను సింగరేణి మండలంలోని వివిధ శాఖల అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో బానోత్ పద్మ, ఎంపీఓ రవీంద్ర ప్రసాద్, తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు, డిప్యూటీ తహసీల్దార్ అజ్మీరా లక్ష్మణ్, ఆర్ఐ జగదీష్, హౌసింగ్ ఏఈ నాగేంద్ర తదితర అధికారులను కలిసి వివాహ ఆహ్వాన పత్రికలు అందించి వేడుకకు హాజరుకావాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూరి రాంబాబు, సింగరేణి మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు భూక్య రంజిత్ కుమార్‌తో పాటు పలువురు సర్పంచులు పాల్గొన్నారు.

గాదేపాడులో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేసిన సర్పంచ్ .. భూక్యా రంజిత్ కుమార్

- ఐటీడీఏ ద్వారా లక్ష్మి బికులాల్‌కు ఇల్లు మంజూరు..

- కొబ్బరికాయ కొట్టి నిర్మాణ పనులు ప్రారంభించిన సర్పంచ్



కారేపల్లి, నవంబర్ 25 (భద్రాద్రి న్యూస్ -- రాములు): పేదల సొంతింటి కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా గాదేపాడు గ్రామానికి చెందిన మరో నిరుపేద కుటుంబానికి సొంతింటి అవకాశం లభించింది. గాదేపాడు గ్రామపంచాయతీ పరిధిలోని నునావత్ లక్ష్మి--బికులాల్ దంపతులకు ఐటీడీఏ ద్వారా ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడంతో బుధవారం నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా గాదేపాడు గ్రామపంచాయతీ సర్పంచ్, సింగరేణి మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు భూక్య రంజిత్ కుమార్ కొబ్బరికాయ కొట్టి, ముగ్గు పోసి ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించారు. అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని, ప్రతి ఒక్కరి సొంతింటి కల సాకారమయ్యేలా ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ నన్నెపోయిన ఉపేందర్, పంచాయతీ కార్యదర్శి కుమార్, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు సరికొండ రాములు, గ్రామ పెద్ద సపావత్ బద్రు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్ అజ్మీరా లక్ష్మణ్ నాయక్‌కు ఘన సన్మానం

- మర్యాదపూర్వకంగా సత్కరించిన టీజీటీజీటీఎఫ్ రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ అజ్మీరా వీరు నాయక్..

- ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్ష



కారేపల్లి, నవంబర్ 25 (భద్రాద్రి న్యూస్ -- రాములు): సింగరేణి మండలం పేరుపల్లి గ్రామానికి చెందిన అజ్మీరా లక్ష్మణ్ నాయక్ నూతనంగా డిప్యూటీ తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించడంతో టీజీటీజీటీఎఫ్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సింగరేణి మండల కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజీటీజీటీఎఫ్ సింగరేణి మండల అధ్యక్షుడు, రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ అజ్మీరా వీరు నాయక్ పాల్గొని నూతన డిప్యూటీ తహసీల్దార్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. తమ ప్రాంతానికి చెందిన వ్యక్తి ప్రభుత్వంలో కీలకమైన బాధ్యతలు చేపట్టడం సంతోషకరమని పేర్కొన్నారు. నూతన బాధ్యతల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ, పారదర్శకమైన సేవలందించాలని, తన పరిపాలనా అనుభవంతో ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీజీటీజీటీఎఫ్ రాష్ట్ర నాయకులు భూక్య రాంకోటి రాథోడ్, రాంజీ, శంకర్ తదితరులు పాల్గొని అజ్మీరా లక్ష్మణ్ నాయక్‌కు అభినందనలు తెలియజేశారు.

రాజ్యాంగం కల్పించిన విద్యా అవకాశాలే సమానత్వానికి పునాది

- విద్యతోనే అణగారిన వర్గాల అభ్యున్నతి..

సామాజిక న్యాయం,

ఆత్మగౌరవానికి విద్యే ఆయుధం

- హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ ఫోరం

జిల్లా అధ్యక్షుడు కోటపాటి రుక్మారావు

ఖమ్మం ప్రతినిధినిధి ,నవంబర్ 25 (భద్రాద్రి న్యూస్): సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం, ఆత్మగౌరవం నెలకొల్పడంలో రాజ్యాంగం కల్పించిన విద్యా అవకాశాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ ఫోరం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు కోటపాటి రుక్మారావు పేర్కొన్నారు. విద్య అనేది కేవలం ఉద్యోగ సాధనకే పరిమితం కాకుండా వ్యక్తిత్వ వికాసానికి, సామాజిక మార్పుకు, దేశాభివృద్ధికి బలమైన పునాది అని ఆయన అభిప్రాయపడ్డారు. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు, గౌరవప్రదమైన జీవనం కల్పించడంతో పాటు విద్యను సామాజిక మార్పుకు శక్తివంతమైన సాధనంగా గుర్తించిందన్నారు. పేదరికం, నిరక్షరాస్యత, కుల వివక్ష, సామాజిక అసమానతలను అధిగమించి ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు కల్పించాలనే లక్ష్యాన్ని రాజ్యాంగం నిర్దేశించిందని వివరించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విద్యకు అత్యంత ప్రాధాన్యతనిచ్చారని, ఆయన ఇచ్చిన “విద్యను అభ్యసించండి, సంఘటితం కండి, పోరాడండి” అనే సందేశం నేటికీ సమాజ అభ్యున్నతికి మార్గదర్శకంగా నిలుస్తోందన్నారు. విద్య ద్వారానే అణగారిన వర్గాలు తమ హక్కులను తెలుసుకొని ఆత్మగౌరవంతో సమాజంలో ఉన్నత స్థానాలను సాధించగలవని పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21-A ద్వారా 6 నుంచి 14 సంవత్సరాల పిల్లలకు ఉచిత, నిర్బంధ విద్యను ప్రాథమిక హక్కుగా కల్పించారని, ఆర్టికల్స్ 15(4), 15(5) సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాలు, ఎస్సీ, ఎస్టీల విద్యాభివృద్ధికి ప్రత్యేక అవకాశాల కల్పనకు మార్గం చూపుతున్నాయని తెలిపారు. ఆర్టికల్ 46 అణగారిన వర్గాల విద్యా, ఆర్థిక ప్రయోజనాలను ప్రోత్సహించాలని ప్రభుత్వాలకు దిశానిర్దేశం చేస్తోందని, ఆర్టికల్స్ 29, 30 మైనారిటీల విద్యా, సాంస్కృతిక హక్కులకు రక్షణ కల్పిస్తున్నాయని వివరించారు. రాజ్యాంగం కల్పించిన అవకాశాల ఫలితంగా ఒకప్పుడు విద్యకు దూరంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులు నేడు ఉన్నత విద్యను అభ్యసించి డాక్టర్లు, ఇంజనీర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులుగా ఎదుగుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ హాస్టళ్లు, గురుకుల విద్యాసంస్థలు, ఉపకార వేతనాలు, రిజర్వేషన్లు పేద విద్యార్థుల జీవితాల్లో విద్యా వెలుగులు నింపుతున్నాయని, ముఖ్యంగా బాలికల విద్య, మహిళా సాధికారతకు ఇవి ఎంతో దోహదపడుతున్నాయని తెలిపారు. అయితే విద్యా హక్కు పరిపూర్ణంగా అమలుకావాలంటే ప్రతి పేద విద్యార్థికి నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు, డిజిటల్ విద్య, ఉన్నత విద్యకు సమాన అవకాశాలు అందించాలని సూచించారు. ఇందుకు ప్రభుత్వాలతో పాటు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి పేద విద్యార్థి చేతిలో పుస్తకం పెట్టి, ప్రతి అణగారిన కుటుంబంలో విద్యా వెలుగులు నింపడమే బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలకు మనమిచ్చే నిజమైన నివాళి అని కోటపాటి రుక్మారావు పేర్కొన్నారు. రాజ్యాంగం కల్పించిన విద్యా అవకాశాలను ప్రతి ఒక్కరూ అందిపుచ్చుకున్నప్పుడే సమానత్వం, సామాజిక న్యాయం, అభివృద్ధితో కూడిన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.



పేద కుటుంబాలకు అండగా ఇందిరమ్మ జీవిత బీమా పథకం

- పోలంపల్లిలో ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ ప్రారంభం.. అర్హులైన ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలి: డీసీసీ కార్యదర్శి ధరావత్ బద్రు నాయక్, సర్పంచ్ హేమలత బాలాజీ

కారేపల్లి, నవంబర్ 25 (భద్రాద్రి న్యూస్ -- రాములు): పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ జీవిత బీమా పథకం ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పోలంపల్లి గ్రామపంచాయతీలో ప్రారంభమైంది. కుటుంబానికి ఆధారంగా ఉన్న ఇంటి యజమాని అనుకోని కారణాలతో మరణిస్తే ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొని దిక్కుతోచని పరిస్థితుల్లో పడకుండా ఉండేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ వినూత్న పథకానికి శ్రీకారం చుట్టిందని డీసీసీ కార్యదర్శి ధరావత్ బద్రు నాయక్, పోలంపల్లి సర్పంచ్ ధరావత్ హేమలత బాలాజీ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలోనే ఆదర్శంగా నిలిచేలా తెలంగాణ ప్రభుత్వం ప్రతి అర్హులైన కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా సౌకర్యాన్ని కల్పించడం హర్షణీయమన్నారు. ఈ పథకం కింద లబ్ధిదారులు ఎలాంటి ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదని, బీమా కంపెనీలకు చెల్లించాల్సిన మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తుందని వివరించారు. కుటుంబ పెద్దను కోల్పోయిన సమయంలో మిగిలిన కుటుంబ సభ్యులకు ఈ బీమా మొత్తం ఆర్థికంగా అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. పేద కుటుంబాలకు భరోసా కల్పించే ఈ పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, తమకు కేటాయించిన పరిధిలో ఆన్‌లైన్ ద్వారా బీమా నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని వారు కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికి చేరవేయడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సర్వన్, పంచాయతీ కార్యదర్శి అనిల్ కుమార్, డేటా ఆపరేటర్ నాగార్జున, గ్రామ పెద్దలు జగ్గియా నాయక్, వార్డు సభ్యులు శివరాం, రమేష్, లావణ్య, లక్ష్మణ్, సుజాత, సంజీవ్, వినాయక్ తదితరులు పాల్గొన్నారు.



బెల్ కంపెనీ జీఎం గుగులోత్ రవి ఇంట పెళ్లి సందడి.. నూతన దంపతులను ఆశీర్వదించిన మంత్రి పొంగులేటి

- సావిత్రి--అనిల్ కుమార్ వివాహ వేడుకకు హాజరై శుభాకాంక్షలు తెలిపిన మంత్రి.. పాల్గొన్న వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్



కారేపల్లి, నవంబర్ 25 (భద్రాద్రి న్యూస్ -- రాములు): కారేపల్లి మండలం బల్లునగర్ తండాలో బెల్ కంపెనీ జనరల్ మేనేజర్ గుగులోత్ రవి కుటుంబంలో వివాహ వేడుక ఘనంగా జరిగింది. ఈ శుభకార్యానికి రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరై నూతన వధూవరులు సావిత్రి--అనిల్ కుమార్‌లను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన దంపతులకు పుష్పగుచ్ఛం అందజేసి, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు కొనసాగాలని ఆకాంక్షించారు.

మంత్రి రాకతో పెళ్లి వేడుకకు ప్రత్యేక కళ

గుగులోత్ రవి కుటుంబ సభ్యుల ఆహ్వానం మేరకు వివాహ వేడుకకు విచ్చేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా ముచ్చటించారు. నూతన వధూవరులను ఆశీర్వదించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర మంత్రి హోదాలో ఉన్నప్పటికీ కుటుంబ శుభకార్యానికి హాజరై ఆత్మీయతను చాటుకోవడంతో వేడుకలో ప్రత్యేక సందడి నెలకొంది. మంత్రి రాకతో బల్లునగర్ తండాలో వివాహ వేడుకకు మరింత శోభ సంతరించుకుంది. తమ కుటుంబ వేడుకకు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించినందుకు గుగులోత్ రవి కుటుంబ సభ్యులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, మంత్రి ఖమ్మం క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి, కారేపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూరి రాంబాబు, జిల్లా కాంగ్రెస్ నాయకులు ఇమ్మడి తిరుపతిరావు, మాజీ ఎంపీటీసీ ఇమ్మడి రమాదేవి, కారేపల్లి సర్పంచ్ మేదరి వీరప్రతాప్ (టోనీ), మల్లెల నాగేశ్వరరావు, తొగర శ్రీను, షేక్ మజీద్ పాషా, ఎం.డి. యాకూబ్ అలీ, షేక్ తాజుద్దీన్, షేక్ షఫీ, షేక్ అబ్దుల్ మతిన్ తదితర ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, ఉపసర్పంచులు పాల్గొని నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.



వెంకటేశ్వర స్వామి సన్నిధిలో ఎమ్మెల్యే కుమార్తె వివాహ ఆహ్వాన పత్రికకు ప్రత్యేక పూజలు

- అడ్డగోడ ఐలయ్య ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు..

- ప్రముఖులకు పెళ్లి శుభలేఖల అందజేత



కారేపల్లి, నవంబర్ 25 (భద్రాద్రి న్యూస్ -- రాములు): వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ కుమార్తె డాక్టర్ గాయత్రి వివాహ మహోత్సవాన్ని పురస్కరించుకొని కారేపల్లి సంత దేవాలయంలోని శ్రీశ్రీశ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం మాజీ ట్రస్ట్ బోర్డు చైర్మన్ అడ్డగోడ ఐలయ్య ఆధ్వర్యంలో వివాహ ఆహ్వాన పత్రికను స్వామివారి సన్నిధిలో ఉంచి పూజలు జరిపించారు. అనంతరం పలువురు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, ఆత్మీయులకు వివాహ ఆహ్వాన పత్రికలను అందజేసి వేడుకకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా అడ్డగోడ ఐలయ్య మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ కుమార్తె డాక్టర్ గాయత్రి వివాహ వేడుకకు ఆత్మీయులు, అభిమానులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించాలని కోరారు. కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆశీస్సులతో వివాహ వేడుక ఎలాంటి ఆటంకాలు లేకుండా వైభవంగా జరగాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రేగులగూడెం సర్పంచ్ వీసం మోతి వీరస్వామి, అర్జున్ రావు, ఉసిరికాయలపల్లి మాజీ ఎంపీటీసీ మూడ్ జ్యోతి చౌహన్, పేరేంటి స్వామి, బోయిన సాయి, దాంతోజు వినయ్, భాస్కర్ తదితరులకు వివాహ ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

వైరా మిట్టపల్లి గార్డెన్ లో బిఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం

- కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో పేదలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయడంలో విఫలమైంది - ఆర్ జె సి కృష్ణ



వైరా, నవంబర్ 25, (భద్రాద్రి న్యూస్) : వైరా నియోజకవర్గ పట్టణ మున్సిపాలిటీ మిట్టపల్లి గార్డెన్ లో బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశానికి నియోజకవర్గ ఇన్చార్జి ఆర్ జె సి కృష్ణ, జిల్లా నాయకులు లకావత్ గిరిబాబు, కట్ట కృష్ణార్జునరావు, హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈనెల 29న వైరా నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించే దీక్షా దివస్ కార్యక్రమాన్ని పార్టీ కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బిఆర్ఎస్ అధినేత తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష తెలంగాణ ఉద్యమ చరిత్రలో చారిత్రాత్మక ఘట్టంగా నిలిచిపోయిందని ఆయన అన్నారు. 2009 నవంబర్ 29న “తెలంగాణ వచ్చుడో.. కెసిఆర్ సచ్చుడో” అనే నినాదంతో కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష తెలంగాణ ఉద్యమానికి కీలక మలుపుగా మారిందని అన్నారు. కెసిఆర్ దీక్షతో తెలంగాణ ఉద్యమం మరింత ఉధృతమై ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రజల ఆకాంక్ష ఉద్యమ రూపంలో బలపడిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు గడుస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రాబోయే రోజుల్లో బిఆర్ఎస్పార్టీ అధికారంలోకి వస్తుందని పార్టీ కార్యకర్తలు టిఆర్ఎస్ పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ జిల్లా లకావత్ గిరిబాబు, వనమా విశ్వేశ్వరరావు, మనీషా లక్ష్మి, ఐదు మండలాల పార్టీ అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు